సాక్షి
చిత్తూరు
సోమవారం । 18 । డిసెంబర్ । 2023




హద్దు దాటుతున్న ఏనుగులు

కర్ణాటక సరిహద్దులో తిష్ట వేసిన ఏనుగులు క్రమంగా అటవీ సమీప గ్రామాల్లోకి చొరబడి పంటలు ధ్వంసం చేస్తున్నాయి. - 8లో



కబడ్డీ విజేత పుంగనూరు

ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పుంగనూరుకు చెందిన రామకృష్ణ జట్టు విజేతగా నిలిచింది. - 8లో



వైభవంగా శ్రీనివాస కల్యాణం

టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. - 8లో

టీడీపీ కుతంత్రం

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారం కోసం టీడీపీ అడ్డదారులు తొక్కుతోంది. అధికార పార్టీ మద్దతుదారుల ఓట్ల తొలగింపునకు కుట్రలు పన్నింది. వైఎస్సార్‌సీపీ గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల మన్ననలను పొందుతోంది. ఇది చూసి ఓర్వలేక పోతున్న ప్రతిపక్షం తప్పుడు కారణాలతో వైఎస్సార్ సీపీ ఓట్ల తొలగింపునకు ఫారం-7 దాఖలు చేసింది. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, నగరి, జీడీ నెల్లూరు, కుప్పం నియోజకవర్గాల్లో 27,008 ఓట్లను తొలగించాలని టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సురేష్ ఫిర్యాదులను అందజేయడంతో రాష్ట్రంలో దొంగ ఓట్ల కలకలం రేగింది.

- దొంగ ఓట్ల కోసం టీడీపీ అడ్డదారులు
- బోగస్ అప్పీళ్లను అధికారులకు అందజేస్తున్న ప్రతిపక్షం
- విచారించి ఈసీకి నివేదిక పంపిన యంత్రాంగం
- వైఎస్సార్‌సీపీ ఓట్ల తొలగింపునకు టీడీపీ కుట్రలు


క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్న బీఎల్‌ఓలు

టీడీపీ అందజేసిన ఫిర్యాదులు

నియోజకవర్గం	ఫారం-7 ఫిర్యాదులు
పుంగనూరు	3,605
నగరి	5,680
జీడీ నెల్లూరు	5,070
కుప్పం	12,653
మొత్తం	27,008


తేలిన బోగస్ ఫిర్యాదులు

నియోజకవర్గం	తప్పుడు ఫిర్యాదులు
పుంగనూరు	2,629
నగరి	2,526
జీడీ నెల్లూరు	3,258
కుప్పం	8,927
మొత్తం	17,340

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా అమలవుతున్నాయి. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ మరింతగా పెరిగింది. నిజాయితీగా ఎన్నికలకు వెళితే ఓటమి తప్పదన్న భయంతో తెలుగుదేశం పార్టీ అడ్డదారులో తొక్కుతోంది. వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించేందుకు కుట్రలకు తెరతీసింది. దీన్ని అధికార యంత్రాంగం పకడ్బందీగా ఎక్కడికక్కడ తిప్పికొడుతోంది.

గంపగుత్తగా ఫారం7లు

ప్రజల ఆశీస్సులతో గెలవాల్సిన టీడీపీ అడ్డదారులతో అధికారంలోకి వచ్చేందుకు కుట్రలకు పాల్పడుతోంది. 2024 లో జరగబోయే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు పచ్చ కుట్రకు ఆ పార్టీ తెరలేపింది. చిత్తూరు జిల్లా లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించాలని టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ సురేష్ గుంపగుత్తగా ఎన్నికల సంఘానికి ఫారం-7లను అందజేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారు సమర్పించిన ఫారం-7లపై కలెక్టర్ షణ్మోహన్ ఈఆర్‌ఓల చేత ప్రత్యేకంగా తనిఖీలు చేయించారు. ఆ విచారణలో 90 శాతం మేరకు తప్పుడు పత్రాలతో దరఖాస్తులు అందినట్లు ఈఆర్‌ఓలు నివేదికలు అందజేశారు.


అధికారులు ఈసీకి పంపిన నివేదిక

17,340 తప్పుడు ఫారం–7లు టీడీపీ నమోదు

టీడీపీ గంపగుత్తగా ఎన్నికల సంఘానికి అందజేసిన ఫారం–7 ఫిర్యాదుల్లో 17,340 తప్పుడు పత్రాలేనని కలెక్టర్ షణ్మోహన్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపిన విచారణ నివేదికల్లో పేర్కొన్నారు. ప్రజా ప్రాతినిధ్యచట్టం–1950 లో సెక్షన్–123(3) కి విరుద్ధంగా మైపార్టీ డ్యాష్‌బోర్డు.కామ్ వెబ్‌సైట్‌ను టీడీపీ ఏర్పాటు చేసింది. ఆ వెబ్‌సైట్ ద్వారా ఓటర్ల రాజకీయ పార్టీల మద్దతు అభిప్రాయాలను సేకరించారు. సేకరించిన ప్రకారం వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను గుర్తించి తొలగించేందుకు అత్యధికంగా ఫారం–7లను నమోదు చేసి కుట్రలకు పాల్పడ్డారు. బతికున్నప్పటికీ చనిపోయినట్లు చిత్రీకరించి, నకిలీవి అంటూ వక్రీకరించి, శాశ్వతంగా వలస వెళ్లారంటూ మాయచేసి, రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ పేర్కొని, చిత్తూరు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 27,008 ఓట్లు తొలగించాలని అప్పీలు ఎన్నికల సంఘానికి ఇచ్చారు. వారు అందజేసిన అప్పీలు ప్రకారం జిల్లాలో ఆయా నియోజకవర్గాల ఈఆర్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. వారి పరిశీలన అనంతరం వీటిలో 17,340 ఫారాలు బోగస్ అని ఈఆర్‌ఓలు తేల్చారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ నేతలు ఫారం–7 దరఖాస్తులను సమర్పించారని అధికారులు పేర్కొంటున్నారు. ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు ఉన్నట్లైతే రోజుకు గరిష్టంగా 5 ఫారం–7 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో నమోదు చేయవచ్చు. అయితే టీడీపీ నాయకులు రోజుకు 10 నుంచి 20 వరకు ఫారం–7 దరఖాస్తుల నమోదుకు పాల్పడ్డారని తెలిసింది. తప్పుడు సమాచారంతో ఫారం–7 లను నమోదు చేస్తే చట్టప్రకారం సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయవచ్చు. 17,340 తప్పుడు సమాచారంతో ఫారం–7 లను నమోదు చేసిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

నివేదికలు ఈసీకి పంపించాం

“ ఓటర్ల జాబితా కసరత్తు పకడ్బందీగా జరుగుతోంది. పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి చర్యలు చేపడుతున్నాం. ఈసీ నుంచి అందిన ఫిర్యాదులను ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్‌ఓలు క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశీలన అనంతరం ఈఆర్‌ఓలు ఇచ్చిన నివేదికలను ఈసీకి పంపించాం. కసరత్తులో ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తున్నాం.

– రాజశేఖర్, డీఆర్‌ఓ, చిత్తూరు

న్యూస్‌రీల్

కిక్కిరిసిన బోయకొండ


బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచే గంగమ్మ ఆలయంలో రద్దీ ఒక్కసారిగా పెరగడంతో క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షణలో అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

యాత్ర వాహనం పరిశీలన


ప్రచార వాహనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వికసిత భారత్ సంకల్ప యాత్ర ప్రచార వాహనాన్ని ఆదివారం జెడ్పీ కార్యాలయంలో యాత్ర నోడల్ అధికారి, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. జిల్లాకు ఆరు వాహనాలు వచ్చాయన్నారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పై విస్తృతంగా ప్రచారం చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు షెడ్యూల్ ఖరారైందని చెప్పారు. జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో వాహనాన్ని కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఆర్సీ డీసీ షణ్ముగం పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు నారాయణగిరి ఉద్యానవనం వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 59,734 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,654 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.52 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఐకమత్యం చాటుదాం


ఐక్యత చాటుతున్న గాండ్ల సంఘ నాయకులు

చిత్తూరు రూరల్: గాండ్ల కులస్తులంతా ఐకమత్యం చాటాలని రాష్ట్ర గాండ్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ భవానీ ప్రియ, జిల్లా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు భూపేష్ గోపినాథ్ పిలుపునిచ్చారు. నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం భూపేష్ ఆధ్వర్యంలో కార్తీక మాస వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గాండ్ల సంఘ నాయకులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు సభను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని గాండ్లకులస్తులంతా ఒక్కతాటిపై నిలవాలన్నారు. అందరిలోనూ మరింత ఉత్తేజం, బలాన్ని నింపుదామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణనలో కచ్చితంగా నమోదు చేయించాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుల పరంగా సమస్యలుంటే వాటిని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత తమదన్నారు. అందరూ ఐకమత్యంతో ఉండి కులాన్ని బలపరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు, కార్యనిర్వాహకులు నరవ అనంతం, కమిటీ కన్వీనర్ సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి బుర్రామధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

కోనేటిరాయస్వామి కల్యాణం- రమణీయం


కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీకోనేటిరాయ స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. తరువాత కల్యాణోత్సవం నిర్వహించి ఉత్సవర్లపై తలంబ్రాలు కురిపించి మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో పాల్గొని భక్తి శ్రద్ధలతో వీక్షించి తరించారు. అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు.

నేడు స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 18న రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు.

నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

చిరస్మరణీయం.. రాయల రాజసం



శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యేలు, బలిజ జేఏసీ సభ్యులతో మంత్రి పెద్దిరెడ్డి (ఇన్‌సెట్) హాజరైన జనం

మదనపల్లె : బలిజల ఆరాధ్యదైవమైన శ్రీ కృష్ణదేవరాయలు మంచి పరిపాలనా దక్షుడిగా, నీతికి, నిజాయితీకి మారుపేరుగా, సమైక్యతా భావాలను పెంపొందించిన మహనీయుడిగా అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచి చరిత్రలో నిలిచిపోయిన రారాజు అని గనులు, విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. బలిజ జేఏసీ మదనపల్లె అధ్యక్షుడు వైఎస్.మునిరత్నం ఆధ్వర్యంలో మండలంలోని బసినికొండ పంచాయతీ పుంగనూరు బైపాస్‌రోడ్డు వై జంక్షన్‌లో ఏర్పాటుచేసిన శ్రీ కృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు నవాజ్‌బాషా, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆరణిశ్రీనివాసులు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ పోకల అశోక్‌కుమార్, కర్ణాటక కైవారం శ్రీక్షేత్ర ధర్మాధికారి ఎం.ఆర్.జయరామయ్య తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కొద్దినెలల ముందే పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో ఓ విగ్రహాన్ని ఏర్పాటుచేశామని, ఇప్పుడు రెండోది ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాయల కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, చంద్రగిరికోట, తిరుపతి రాయలచెరువు ఆయన హయాంలో నిర్మితమై నేడు రైతులకు పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నాయని అన్నారు. బలిజల ఆరాధ్యదైవం శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలను తమ మనోభావాలకు తగ్గట్లుగా ఏర్పాటుచేసుకుంటామని కోరితే ఉచితంగా అందజేస్తామని ఎంపీ మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు మాట్లాడుతూ..బలిజల కలను నెరవేర్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ప్రభుత్వానికి బలిజలు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ... బలిజలకు అండగా నిలుస్తామన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు మాట్లాడుతూ వైజాగ్, తిరుపతి పట్టణాల్లో కాపుభవన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అంతకుముందు బలిజయువత ఆధ్వర్యంలో పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రింగ్‌రోడ్డు నుంచి బసినికొండ వై జంక్షన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. విగ్రహావిష్కరణకు కర్ణాటక, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్యజిల్లాలతో పాటు రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని పుంగనూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో బలిజకులస్థులు హాజరయ్యారు. డీకే.ఆదికేశవులు నాయుడు కుమార్తె తేజస్విని, రాష్ట్ర యువకాపునాడు అధ్యక్షులు మిద్దింటికిషోర్, అమరనాథ్, జిల్లా యువజన విభాగం బండ్లలక్ష్మీపతి, సర్పంచ్‌లు ఆనందపార్థసారథి, చిప్పిలిచలపతి, ఆకులగజేంద్ర, డీసీసీ మాజీ అధ్యక్షులు సుధాకర్, బలిజజేఏసీ కమిటీ సభ్యులు రేగడప్రసాద్‌కుమార్, ఎస్.భాస్కర్(మహర్షి), కత్తిలక్ష్మన్న, ఆకులకృష్ణమూర్తి, గుండాల రామచంద్ర, బొంతలజయరాం, జంగాలశివరాం, కూరాకుల ఆంజనేయులు, అండేశివప్రసాద్, రెడ్డిశశికుమార్, మిద్దింటిశంకరనారాయణ, బోర్‌వెల్ సుధ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కళ్లల్లో ఆనందం


తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కేరోజా

- ముప్పై ఏళ్ల తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి రోజా

నగరి : కొండంచు నుంచి జలం కదిలిరావడంతో మూడు దశాబ్దాల తాగునీటి సమస్య పరిష్కారమైంది. మండలంలోని అర్జునప్పనాయుడు కండ్రిగ, చెర్లోకండ్రిగ, టివి కండ్రిగ గ్రామాల్లో 30 సంవత్సరాల నుంచి తాగునీటి సమస్య ఉంది. ఇది తెలుసుకున్న మంత్రి ఆర్కేరోజా భగీరథ ప్రయత్నం చేయడంతో పరిష్కారమైంది. ప్రజలకు మంచి చేయాలన్న మనసు, పట్టు వదలని ప్రయత్నం ఉంటే పరిష్కారం కాని సమస్య లేదంటూ మంత్రి మరోమారు నిరూపించారు. గతంలో బుగ్గ అగ్రహారం ప్రజలు ఏళ్ల తరబడి పడ్డ నీటి కష్టాలను తీర్చడానికి 6 కిలోమీటర్ల దూరంలోని కొండంచు నుంచి రూ.35 లక్షల వ్యయంతో ప్రత్యేక పైపులైన్ల ద్వారా తాగునీటిని తెప్పించిన మంత్రి అక్కడి నుంచి జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.13 లక్షల వ్యయంతో అర్జునప్పనాయుడు కండ్రిగ, చెర్లోకండ్రిగ, టివి కండ్రిగ గ్రామాలకు తాగునీటి సరఫరా చేశారు. ఆదివారం తాగునీటి ట్యాప్ ద్వారా నీటి సరఫరాను ఆమె ప్రారంభించారు. దీంతో తాగునీటి కోసం సమీప గ్రామాలైన బుగ్గ అగ్రహారం, వేలావడి, పర్వతరాజపురం, ఇరుగువాయి గ్రామాల్లో తాగునీరు అందే సదుపాయం కలిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, ఢిల్లి, సర్పంచ్ రవికుమార్, నాయకులు చంద్రారెడ్డి, గురుమూర్తి, అరుణాచలం రెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పొడిగింపు

చిత్తూరు రూరల్: ఒక్కరోజు పాటు రేషన్ పంపిణీని పొడిస్తున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. జిల్లాలో ప్రతి నెలా 17వ తేదీ వరకు రేషన్ పంపిణీ ఉంటుందన్నారు. అయితే ప్రభుత్వం సోమవారం కూడా రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 88శాతం పంపిణీ జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. మిగిలిన వారు ఈరోజు తీసుకోవాలని కోరారు.

జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ అన్నారు. కుప్పం ఎన్‌జీఓస్ హోంలో ఆదివారం నిర్వహించిన పెన్షనర్ల దినోత్సవంలో వారు ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రెండేళ్లు కరోనా విపత్తు సంభవించిందని గుర్తు చేశారు. అయినప్పటికీ ఉద్యోగులకు, పెన్షనర్లకు నెలసరి వేతనాలు సక్రమంగా ఇచ్చినట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించినట్లు వివరించారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణ చూసి, కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, పెన్షన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సెల్వం తదితరులు పాల్గొన్నారు.

కోడెగిత్తల జోరు



కోడెగిత్తల జోరు.. యువత హుషారు...అరుపులు..కేకలతో ఎడ్ల పందేలు దుమ్ము రేపాయి. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని గోవిందవారిపల్లెలో ఎడ్ల పందేలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గ్రామంలోని యువత ఘనంగా ఏర్పాట్లు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తీసుకొచ్చిన ఎడ్లకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్లు కట్టి పందేనికి ఉసిగొల్పారు. అంతకుముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్న యువత అల్లి వద్ద పలకలు లాక్కోవడానికి నిలబడ్డారు. ఈలలు వేస్తూ ఉసికొల్పిన కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జనాలపై దూసుకుపోయాయి. ఎడ్లను నిలువరించి పలకలు పట్టేందుకు యువత పోటీ పడ్డారు. ఎడ్ల వేగాన్ని నిలువరించేందుకు యువత ఉత్సాహంతో పాల్గొని కట్టడి చేసి పలకలను లాక్కొన్నారు. పలకలు పట్టిన యువత విజయ దరహాసంతో చిందులు వేశారు. కొందరు ఎడ్ల కింద పడి గాయపడ్డారు. రామచంద్రాపురం, కార్వేటినగరం, పెనుమూరు మండలాల నుంచి యువకులు తరలిరావడంతో జనసంద్రమైంది. – వెదురుకుప్పం

రూ.35 కోట్లతో బోయకొండ అభివృద్ధి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈవో చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన బోయకొండను రూ.35 కోట్ల వ్యయంతో భక్తులకు అవసరమైన సదుపాయాలు, వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నట్లు చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. బోయకొండ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఈఓ చంద్రమౌళితో కలిసి సమీక్షించారు. వారు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అధ్వర్యంలో ఇదివరకే కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేయించి పనులు మొదలెట్టినట్లు గుర్తుచేశారు. ఆ పనులన్నింటినీ త్వరగా పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంకనూ అవసరమైన పనులను మంత్రి పెద్దిరెడ్డి సూచనల మేరకు మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచిన విధంగా పనులకు అంచనాలు సిద్ధం చేశామన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. మౌళికవసతులతో పాటు సిబ్బంది విధుల కార్యకలాపాలపై చర్చించారు. ఈ సమావేశంలో పాలక మండలి సభ్యులు భాస్కర్‌రెడ్డి, బుడ్డమ్మ, రాజేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌లు సురేంద్రరెడ్డి, రామనాథం, వీరకుమార్, కృష్ణారెడ్డి, నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, లడ్డూరమణ, డిష్‌సూరి, సురేంద్రరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన టెంపో



ఇంటిని ఢీకొన్న టెంపో

శాంతిపురం: పలమనేరు జాతీయ రహదారిలోని గుండిశెట్టిపల్లిలో అతి వేగంగా వచ్చిన టెంపో రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోకి దూసుకుపోయింది. పోలీసుల కథనం మేరకు, ఆదివారం మధ్యాహ్నం గూడూరు నుంచి యంత్ర పరికరాల లోడ్డు ఉన్న టెంపో తమిళనాడులోని కోయంబత్తూరుకు బయలుదేరింది. గుండిశెట్టిపల్లి వద్దకు రాగానే అతివేగంగా వెళుతూ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దాదాపు 20 అడుగుల దూరం విద్యుత్ స్తంభాన్ని లాక్కుంటూ వెళ్లి బాలప్పగారి జయరామప్ప ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో ఇంట్లో కొంత భాగం పూర్తిగా కూలిపోయి, గోడలన్నీ బీటలువారాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇంట్లోని మంచం, సోపాలు ముక్కలయ్యాయి. ఈ సంఘటనలో కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన టెంపో డ్రైవర్ నౌషద్(40), క్లీనర్ సద్దాం(52) స్వల్పంగా గాయపడ్డారు. వీరిని 108 ద్వారా కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. దీనిపై రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హద్దు దాటుతున్న గజరాజులు

- కర్ణాటక సరిహద్దులో ఏనుగుల గుంపు
- గతంలోనూ ఇదే మార్గంలో ప్రవేశించిన వైనం
- కర్ణాటక, తమిళనాడు అడవుల్లోంచి కౌండిన్యలోకి మళ్లింపు



రైల్వే ట్రాక్‌ను దాటుతున్న కర్ణాటక ఏనుగుల గుంపు (ఫైల్)

పలమనేరు: జిల్లాలోని పలమనేరు, కుప్పం నియోజకవర్గాల పరిధిలో ఉన్న కౌండిన్య అభయారణ్యంలో దశాబ్దాలుగా గజరాజుల సమస్య ఉంది. వీటికి తోడు తమిళనాడులోని మోర్ధన ఫారెస్ట్ నుంచి తరచూ ఏనుగులు ఈ ప్రాంతానికి వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. తాజాగా కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేట అడవులనుంచి చొరబడిన ఏనుగుల గుంపు కుప్పం నియోజకవర్గ సరిహద్దులో సంచరిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. అటు తమిళనాడు, ఇటు కర్ణాటక అటవీ అధికారులు ఏనుగులను కౌండిన్య అడవుల్లోకి మళ్లించడంతోనే ఇక్కడ సమస్య ఎక్కువైంది.

వనం వదిలి జనంలోకి..

కౌండిన్య అభయారణ్యం దాదాపు 250 కిలోమీటర్లు మూడు రాష్ట్రాల సరిహద్దుగా ఉంటుంది. ఇందులో పలమ నేరు, కుప్పం నియోజకవర్గంలోని ఏనుగులు సంచరించే అడవి ప్రాంతంలో 70 కిలోమీటర్లు ఎలిఫెంట్ ట్రెంచ్‌లు, 230 కిలోమీటర్ల మేర సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఏనుగులు వీటిని ధ్వంసం చేసి పంటపొలాలు, జనావాసాల వైపు దూసుకొస్తున్నాయి. ప్రస్తుతం స్థానిక కౌండిన్యలోనే 64 ఏనుగులు ఉన్నట్టు అటవీశాఖ చెబుతోంది. ఇవి ప్రస్తుతం వి.కోట మండలం అటవీ సమీప గ్రామాల్లో 13 దాకా సంచరిస్తూ పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. పెద్దపంజాణి ప్రాంతంలో ఎనిమిది సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పలమనేరు మండలంలోని కౌండిన్యలో పదకొండు ఉండగా, మరో మూడు మదపుటేనుగులు ఒంటరిగానే సంచరిస్తున్నాయి. తమిళనాడులోని మోర్ధన అడవిలో రెండు, మూడు గుంపులుగా ఉన్నట్టు తెలుస్తోంది. అడవిలో ఉండాల్సిన ఏనుగులు పంట పొలాలపై, జనంపై యథేచ్ఛగా దాడులు చేస్తున్నాయి.

తాజాగా కర్ణాటక నుంచి ఏనుగులు

కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేట, కేజీఎఫ్ అడవుల్లోంచి 24 ఏనుగులు రెండు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇందులో పిల్ల ఏనుగును కలిగిన 14 ఏనుగుల గుంపు ప్రస్తుతం మన రాష్ట్రం వైపు వచ్చినట్లు తెలుస్తోంది. అక్కడి ఫారెస్ట్ అధికారులు వీటిని బన్నేర్‌ఘట్ట అడవులోకి మళ్లించకుండా కుప్పం వైపునకు మళ్లించడంతోనే అవి ఈ మార్గం వైపు వస్తున్నట్టు సమాచారం. గతంలోనూ కర్ణాటక రాష్ట్రం నుంచి శాంతిపురం, గుడుపల్లి వైపుకొచ్చిన ఏనుగులు ఓ వ్యక్తిని సైతం తొక్కి చంపాయి. అప్పట్లో కుప్పం ఫారెస్ట్ అధికారులు వీటిని ఏపీలోకి రానివ్వకుండా మళ్లీ కర్ణాటక అడవుల్లోకి మళ్లించి ట్రాకర్స్‌ను పహారాగా ఉంచి సమస్యను పరిష్కరించారు.

వచ్చిన దారిని మరవని ఏనుగులు

ఏనుగులు ఓ సారి కొత్తగా ప్రయాణించిన మార్గాన్ని తన జీవితకాలంలో మరిచిపోదని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఇవి గతంలో ఎలా ప్రయాణించాయో అదే మార్గంలో మళ్లీ వస్తుంటాయి. ఇవి రోజుకు 30 కిలోమీటర్ల దాకా సంచరిస్తాయి. గతంలో కుప్పం సరిహద్దు గ్రామాల్లోకి వచ్చిన అలవాటు మేరకు మళ్లీ ఇక్కడికి రావచ్చన్న ఆందోళన మొదలైంది. ఇదే టెన్షన్ అక్కడి గ్రామాల జనాల్లో కనిపిస్తోంది.

కారిడార్‌తోనే పరిష్కారం

ఏనుగుల సమస్యకు మూడు రాష్ట్రాల్లో కారిడార్ నిర్మాణం ఒక్కటే శాశ్వత పరిష్కార మార్గంగా కనిపిస్తోంది. కర్ణాటకలోని బంగారుపేట, మాలూరు, కేజీఎఫ్, బన్నేరుగట్ట, తమిళనాడులోని మోర్ధన, క్రిష్ణగిరి, హోసూరు, కావేరిపట్నం తదితర ప్రాంతాల నుంచి కౌండిన్యలోకి తరచూ ఏనుగులు రావడంతోనే రైతులకు ఎక్కువ నష్టం వాటిల్లుతోంది. ఇవి అడవులను దాటి జనావాసాల మీదుగా సంచరిస్తున్నాయి. ఏనుగుల శాశ్వత పరిష్కారంలో భాగంగా మూడు రాష్ట్రాల్లోని అడవిలో ఓ కారిడార్‌ను నిర్మించేందుకు గతంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వైల్డ్ అనిమల్ ప్రొటెక్షన్‌కు ప్రభుత్వం నివేదిక పంపినా మూడు రాష్ట్రాలకు సంబంధించిన సమస్య కాబట్టి కార్యరూపం దాల్చలేదు. దీంతోపాటు ఏనుగుల సంరక్షణ కోసం అడవుల్లో నీటి కుంటలు, షెల్టర్లు, అవసరమైన వెదురు, గడ్డి పెంపకాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై స్థానిక ఎఫ్ఆర్వో శివన్నను వివరణ కోరగా కర్ణాటక సరిహద్దుల్లోని ఏనుగులు కౌండిన్యలోకి రాకుండా తమశాఖ చూస్తోందన్నారు. ఇక స్థానికంగా ఉన్న ఏనుగులు గుంపులుగా విడిపోయి సంచరిస్తున్నాయన్నారు. ఇక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నామని తెలిపారు.

నమ్మించి.. ఉడాయించి

చిత్తూరు అర్బన్: బేకరీ నిర్వహిస్తూ భవన యజమానిని నమ్మించి, రూ.7 లక్షలు అప్పు తీసుకుని ఉడాయించిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్ ఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు, నగరంలోని మిట్టూరు రెడ్‌క్రాస్ వీధికి చెందిన రఘుపతినాయుడు రిటైర్డ్ బ్యాంకు మేనేజరు. గతేడాది ఏప్రిల్‌లో తమిళనాడులోని వర్చూరుకు చెందిన శ్రీనివాసన్, రఘుపతినాయుడు ఇంటి కింద భాగంలో ఖాళీగా ఉన్న ఓ దుకాణాన్ని బేకరీ కోసం అద్దెకు తీసుకున్నాడు. కొద్ది రోజుల తరువాత బేకరీని అభివృద్ధి చేయాలని చెప్పి అప్పుగా రూ.7 లక్షలు కావాలని అడిగారు. దీంతో రఘుపతినాయుడు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు అడిగిన మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా నగదు బదిలీ చేశాడు. రెండు నెలల క్రితం దీపావళి పండుగకు ఊరికి వెళ్లొస్తానని చెప్పిన శ్రీనివాసన్ కుటుంబ సభ్యులతో కలిసి పారిపోయాడు. పలుచోట్ల వెతికినా ఇతని ఆచూకీ తెలియక పోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్ననాగరాజు జిల్లా బహిష్కరణ

పలమనేరు: పలమనేరు మండలంలోని కొలమాసనపల్లికి చెందిన సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న చిన్న నాగరాజు అలియాస్ శంకర(55)ను ఆరునెలల పాటు జిల్లా నుంచి బహిష్కరిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు స్థానిక డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతనిపై పలమనేరు, బైరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆరు కేసులున్నాయని తెలిపారు. జూదం, కర్ణాటక మద్యం అక్రమ రవాణాతో సమాజంలో అశాంతి సృష్టిస్తున్నాడని తెలిపారు. ఎన్నిసార్లు చెప్పినా ప్రవర్తనలో మార్పు రానందున జిల్లా ఎస్పీ, కలెక్టర్ల ఆదేశాల మేరకు ఈ ప్రొసీడింగ్స్ ఇచ్చినట్టు అందులో తెలిపారు.

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులుగా గోపీనాథ్



గోపీనాథ్, ముక్తార్ అహ్మద్

చిత్తూరు కలెక్టరేట్: ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులుగా బంగారుపాళెం మండలంలో పని చేస్తున్న టీచర్ గోపీనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏపీటీఎఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు శ్యాంప్రసాద్‌రెడ్డి, అశోక్‌కుమార్, చాంద్‌బాషా ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. నూతన జిల్లా కమిటీ అధ్యక్షులుగా గోపీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముక్తార్‌అహ్మద్, రాష్ట్ర కౌన్సిలర్లుగా జగన్నాథం, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



మృతి చెందిన వృద్ధుడు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. మొగిలి శివాలయం సమీపంలో 75ఏళ్ల వృద్ధుడు మృతి చెందిన విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు మొగిలి శివాలయం వద్దకు చేరుకున్నారు. మృతి చెందిన వృద్ధుని చిరునామా గురించి వాకబు చేశారు. తెల్లని చొక్కా, పంచె ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు





గాయపడిన సురేష్, పురుషోత్తం

శాంతిపురం: కనుమలదొడ్డి– రాళ్లబూదుగూరు మార్గంలో కర్లగట్ట క్రాసు వద్ద బైకు అదుపుతప్పి ముగ్గురు యువకులు గాయపడ్డారు. కర్లగట్ట నుంచి రాళ్లబూదుగూరు వైపునకు అదే గ్రామానికి చెందిన సురేష్(21), మిత్రులు శివరామపురానికి చెందిన పురుషోత్తం(20), రామకుప్పం మండలం రెడ్డివారిపల్లికి చెందిన మరో యువకుడు ఆదివారం బైక్‌పై బయలుదేరారు. అంతర్రాష్ట్ర రహదారిపైకి రాగానే బైకు అదుపు తప్పి రోడ్డుపై పడ్డారు. స్వల్పగాయాల పాలైన రెడ్డివారిపల్లి యువకుడు అక్కడి నుంచి జారుకోగా తీవ్రంగా గాయపడిన మిగతా ఇద్దరిని 108 ద్వారా కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ విజేత పుంగనూరు



ప్రథమ బహుమతి అందుకుంటున్న రామకృష్ణ

పుంగనూరు: ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీల్లో విజేతగా పుంగనూరు జట్టు నిలించింది. రెండో స్థానాన్ని తిరుపతి జట్టు కైవసం చేసుకుంది. పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. పట్టణానికి చెందిన రాష్ట్ర స్థాయి క్రీడాకారులు లోకేష్, యశోదకుమార్ జ్ఞాపకార్థం వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 24 జట్లు పాల్గొన్నాయి. పట్టణంలోని నక్కబండకు చెందిన రామకృష్ణ జట్టు, తిరుపతికి చెందిన దినేష్ జట్టు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఎముకలు కొరికే చలిగాలిలో కబడ్డీ పోటీలు ప్రేక్షకులకు ఉరకలెత్తించేలా చేసింది. చివరికి పుంగనూరు జట్టు విజేతగా నిలవడంతో తిరుపతి జట్టు రెండో స్థానంతో సరిపెట్టుకుంది. విజేత జట్టు రూ.50 వేలు నగదు, ట్రోఫీని అందుకున్నారు. తిరుపతికి చెందిన దినేష్ జట్టు రూ.30 వేలు నగదు గెలుచుకుంది. మూడవ స్థానంలో తిరుపతి జట్టు రూ.20 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన పుంగనూరు మండలం ఏడూరుకు చెందిన ఎర్రకోట జట్టు సభ్యులు రూ.10 వేలు గెలుచుకున్నారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర, కో ఆప్షన్ సభ్యుడు తుంగామంజునాథ్ బహుమతులు పంపిణీ చేశారు. హాజరైన క్రీడాకారులకు భోజన, వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ క్లబ్ అధినేత కనకదుర్గా సత్యనారాయణ, జయకృష్ణ, నానబాల సురేష్, తుంగా మంజునాథ్, మహమ్మద్, నవయుగనాథ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం





కల్యాణోత్సవానికి హాజరైన చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, ముస్తాబైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లు



శ్రీవారి కల్యాణోత్సవం వీక్షించేందుకు తరలివచ్చిన భక్తులు

గంగవరం/పలమనేరు: మండల కేంద్రంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భారీగా వేసిన దివ్య కల్యాణ మహోత్సవ ఏర్పాట్లు చేశారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిమంది హాజరయ్యారు. దీంతో ఇక్కడ ఆధ్యాత్మిక శోభ నెలకొంది. శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై ఏర్పాటు చేశారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని, భక్త సంకల్పం, మహాసంకల్పం, మంగళసూత్రధారణ ఘట్టాలతో వేదమంత్రాలను పఠిస్తూ ఈ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. చివరిగా నక్షత్రహారతి, మంగళహారతితో కల్యాణోత్సవం దిగ్విజయంగా ముగిసింది. నేత్ర పర్వంగా సాగిన కల్యాణ ఘట్టాన్ని తిలకించిన భక్తులు భక్తిపరవశంతో మునిగిపోయారు. దీనికి ఎంపీ రెడ్డెప్ప, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ కుటుంబ సమేతంగా, కర్ణాటక రాష్ట్రం కోలారు ఎమ్మెల్యే, శ్రీవారి సేవకులు కొత్తూరు మంజునాథ్, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి ఇందులో పాల్గొన్నారు.

వాంఛ తీర్చుకుని.. హత మార్చి



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, (ఇన్‌సెట్) హత్యకు గురైన మహిళ (ఫైల్)

గంగవరం: మహిళకు మద్యం తాగించి, లైంగిక కోరిక తీర్చుకుని, హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు ఒక రోజులోనే పట్టుకున్నారు. దీనిపై సీఐ కృష్ణమోహన్ ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన లక్ష్మి(57) పదేళ్లకు పైగా పలమనేరు పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ బాటిళ్ళు, కవర్లు ఏరుకుంటూ గుజిరీ దుకాణంలో విక్రయిస్తూ జీవనం సాగించేది. కొన్నాళ్లకు భర్త నాగరాజు మృతి చెందడంతో ఒంటరిగానే పనులు చేసుకుంటూ రాత్రి వేళ ఎక్కడో ఒకచోట తలదాచుకునేది. పలమనేరు మండలం కాలవపల్లెకు చెందిన మంజునాథ్ మేస్త్రీ పనులు చేసుకుంటూ నెల రోజుల క్రితం ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. అప్పటి నుంచి ఇద్దరూ కలిసి కూలి పనులకు వెళుతూ ఆమెను లైంగికంగా వేధించేవాడు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి ఆయన షాపులో మద్యం కొని ఆమెతో కలిసి తాగాడు. వారిద్దరూ అనుకున్నట్టుగానే ఇద్దరూ లైంగికంగా కలిసిన తరువాత కెనరా బ్యాంకు వెనుకాల నిర్మాణంలో ఉన్న ఇంటి వద్దకు ఆమెను తీసుకెళ్లాడు. అక్కడ బలవంతంగా మరోసారి కోరిక తీర్చుకున్నాడు. ఈ విషయాన్ని ఆమె ఎవరికైనా చెప్పేస్తుందేమో అన్న అనుమానంతో పక్కనే ఉన్న కొయ్యతో కొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని అదే స్థలంలో ఉన్న నీటి డ్రమ్ములో తల్లకిందులుగా పడేసి వెళ్లిపోయాడు. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంజునాథ్ ఆ మహిళతో కలిసి తిరిగినట్లు తెలుసుకుని, వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను విచారించగా హత్య చేసినట్టు నేరం అంగీకరించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ కృష్ణ మోహన్ తెలిపారు.

గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్య



గొంతుకోసుకున్న లక్ష్మీనారాయణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నడిరోడ్డుపై వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ ఉలసయ్య కథనం మేరకు, పలమనేరు మండలం కీలపట్లకు చెందిన లక్ష్మీనారాయణ (42)కు అనారోగ్యంగా ఉండడంతో ఆయన స్నేహితుడు రెండు రోజుల క్రితం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణ ఆదివారం మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా తన రక్త పరీక్ష వివరాలు తీసుకుని బయటకు వచ్చేశాడు. అందరూ చూస్తుండగా దర్గా కూడలి వద్ద ఓ మద్యం బాటిల్‌ను పగులగొట్టి గొంతు కోసుకున్నాడు. అటువైపుగా వెళుతున్న ఓ ప్రైవేటు అంబులెన్సులో బాధితుడ్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందచేసి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఖురాన్ కంఠస్థ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



ఖురాన్ కంఠస్థ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని గంగనపల్లె ఆరిఫియా మసీదులో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఖురాన్ కంఠస్థ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ ప్రాంతాలకు చెందిన 3 నుంచి 12 ఏళ్ల విద్యార్థులు పాల్గొన్నారు. అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహారి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫిబ్రవరి 11న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు రాణించాలన్నారు. విజేతలను అంజుమాన్ సభ్యులు అబ్దుల్ గని, రషీద్, వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ గఫార్ ఖాన్ అభినందించారు.